


# మనసు లోతు

పగబట్టిన పాములాగా వర్షం ఆగకుండా కురుస్తూనే వుంది. రెండ్రోజుల క్రితం ఆకాశాన్నలుముకున్న మసక మబ్బులు నల్లగా మారి కసిదీరా కుంభవృష్టి కురిపిస్తున్నాయి. వర్షాకాలంలో వర్షం కురియక ఎండలు కాస్తాయా? కానీ ... ఏడాదికి ఎనిమిది నెలలు ఎండలు డామినేట్ చేస్తున్న ఈ రోజుల్లో సకాల వర్షాలు పడడం సంతోషమే. గంటసేపట్నుంచి మంచం మీద అటూ ఇటూ దొర్లుతున్న శేఖరం తనను తానే సముదాయించుకున్నాడు. గాలికి టపటపలాడుతున్న కిటికీ రెక్కల్ని మూసేసొచ్చి మంచమెక్కాడు.

గోడ గడియారం పదిన్నర చూపిస్తోంది. పొద్దంతా పంజేసి అలసిపోయిన రజని గాఢనిద్రలో వుంది. రజని మెడలో మూడు ముళ్లేసి రేపటికి సంవత్సరము. బంధుమిత్రుల్ని కుటుంబ సమేతంగా రావాలనీ సాయంత్రమే ఫోన్లు చేశాడు. మొదటి పెళ్ళిరోజు ఘనంగా జరుపుకోవాలనుకున్నాడు.

సర్కారాఫీసులో గుమస్తాగా పనిచేస్తోన్న వచ్చే నెలజీతం సరదా పరదాల మీది మందు పార్టీలకే కరిగిపోతోంది. వయస్సులో ఉన్నప్పుడే సుఖాలన్నీ అనుభవించాలి. ఆ తర్వాత తుమ్మితే ఊడిపోయే ముక్కులా తయారైన శరీరం దేన్నీ తట్టుకోలేదు. ఆఫీసు లంచవర్లో అటెండర్ రామరాజుకు విషయం చెప్పి ఐదువేల రూపాయలు అప్పడిగాడు. నెలలో ఏ రోజు అప్పిచ్చినా వచ్చే ఫస్ట్‌నాడు నూటికి పదిరూపాయల వడ్డీతో ముక్కు పిండి వసూలు చేయడం రామరాజుకి అనుభవం నేర్పిన విద్య.

'అనవసరంగా అప్పెందుకు చేస్తారు సార్?' సవినయంగా సవాలు విసిరాడు. తనకదేమీ బాగనిపించలేదు.

'పెళ్ళి రోజు నాడు పదిమందిని పిలిచి దావతు ఇవ్వడం అనవసరమా?'

'తాగుడు, జల్సాలు మానేసి జీతం డబ్బులు జాగ్రత్తగా వాడుకుంటే మీరే నాలాంటి వాళ్ళకి అప్పులిస్తారు. నాలాగా సొంతిల్లు కట్టుకోగలుగుతారు...' గీతాబోధన చేశాడు. తుమ్మమొద్దులా వున్నాడు వెధవ... ఎంగిలి ఇస్తరి ఎత్తమంటే జనాల లెక్కలు పెట్టినట్టు

ఆఫ్టరాల్ అటెండర్ గానికి లోకువైపోయానా? అందరికప్పులిస్తాడు కానీ నాకెందుకివ్వడూ? అరికాలు మంట నెత్తికెక్కింది.

'ఇంతకూ అప్పిస్తావా? ఇవ్వవా?'

'సారీ సర్! ఇవ్వలేను....' మొహమ్మీదే చెప్పేశాడు.

ఓర్నీ... నోట్లో పురుగులు పడి చస్తాడు వెధవ. సమయం సందర్భాలు రానీ... ఎక్కడో ఓ చోట గట్టిగా నొక్కేస్తా.

ఆఫీసర్‌కు మస్కా దట్టించి అక్కవుంటెంట్ చేతులు తడిపేసి అప్పటికప్పుడు ఫెస్టివల్ అడ్వాన్స్ మంజూరు చేయించుకొని తీసుకున్నాడు. కానీ, అది మూడువేలే...! ఏ మూలకు పోతుందో! ముసురుకుంటున్న ఆలోచనల్ని కసిరికొట్టిం తర్వాత కన్నంటుకుంది. నిద్రాదేవి ఒడిలో ఒదిగిపోయాడు.

+

అర్థరాత్రి ఆవులించింది. ఊరంతా గాఢ నిద్రలో మునిగుంది. రజని సుకుమార దేహాని కేదో చల్లగా తాకింది. అది వీపుకిందిదాకా పాకింది. ఉలిక్కిపడి లేచి కూచుంది. నిద్ర పటాపంచలయింది. గుండెల్లో తాచుపాము బుసకొట్టింది. 'పాము ... పాము' పక్కకు జరిగింది అరుస్తూ... పక్కన భర్త గుర్రుపెడుతున్నాడు. జీరో లైటు వెలుతురులో ఏదీ సరిగ్గా కనబడలేదు. పక్క టేబుల్ మీదున్న రిమోట్ కంట్రోల్ అందుకుని ట్యూబ్‌లైట్ వేసింది.

ఆశ్చర్యం... అయోమయం... ఇల్లంతా నీరు నిండింది. మంచమ్మీద పరుపు గూడా తడిసిపోయింది. బయట వర్షం హోరు వినబడుతోంది. గుండెలు బాదుకుంది. బోరున ఏడ్వాలనిపించింది. భుజాలు కుదిపి భర్తను లేపింది. శేఖరం కళ్ళు నులుముకొని చూశాడు.

'ఎక్కన్నుంచి వచ్చిందీ నీరు...' అడిగాడు.

'ఏమోనండీ!' భయం భయంగా గోడ గడియారం చూసింది. రెండు దాటింది. 'యుగాంతం అవుతుందేమోనండీ! సముద్రాలు ఉప్పొంగినట్టుంది..."

వెంటనే టీవీ ఆన్ చేశాడు రిమోట్ కంట్రోల్‌తో... వార్తా చానెల్.

'మూడ్రోజుల్నుండి నగరంలో కుండపోత వర్షాల కారణంగా హుస్సేన్‌సాగర్ నీటిమట్టం ప్రమాదస్థాయిని దాటింది. రాత్రి పన్నెండు గేట్లు ఎత్తివేశారు. ఫలితంగా నాలాల్లో నీరు పొంగి ప్రవహిస్తోంది. కాల్వల పక్కనున్న వీధుల్లోకి, ఇళ్ళల్లోకి నీరు ప్రవేశించింది. కరెంటు పోయింది. మంచం గూడా మునిగింది. గుండెలు గుభేల్‌మన్నాయి. చేతిలో చెయ్యేసుకొని జంటగా మంచం దిగారు. చిమ్మచీకట్లో నీళ్ళు నడుముదాకా వచ్చాయి. గబుక్కున తలుపులు తీశారు. సామానులు నీళ్ళ మీద తేలుతూ కొట్టుకుపోతున్నాయనీ

అర్థమైంది. బియ్యము, వెచ్చాలు అన్నీ మునిగుంటాయి.

ఏం చెయ్యాలో తోచక గుండెలు బాదుకున్నారు. గడప దాటి బయటకొచ్చారు. వర్షం కురుస్తూనే వుంది. బయటగూడా నీరే! జోరుగా ప్రవహిస్తోంది. కాటుక పరిచినట్టు లోకమంతా చీకటిగా ఉంది. నాలా పక్క వీధిలో అద్దె ఇల్లు తీసుకున్నందుకు కాస్సేపు కేకలేసుకున్నారు. మళ్ళీ ఇంట్లోకి రాగలిగారు. గుడ్డివాళ్ళలా చేతుల్తో వెతుక్కుంటూ టేబుల్ మీదుండే సెల్‌ఫోన్ కోసం వెతికారు. దొరకలేదు. టేబుల్ నీటిలో మునిగింది. నీటి ప్రవాహంలో అన్నీ కొట్టుకుపోయాయనీ నిర్ణయమైంది. మంచమెక్కి నించున్నారు. పక్క ఇళ్ళ నుండి ఏడుపులు, అంగలార్పులు వినబడుతున్నాయి.

భర్త గుండెల మీద ఒదిగిపోయింది రజని. 'చచ్చిపోతామేమోనండీ...?' బావురుమంది. శేఖరానికి దుఃఖమాగలేదు. 'చస్తే ఇద్దరం కలిసే చస్తాం రజనీ!' పొదివి పట్టుకున్నాడు.

చుట్టుపక్కల ఏడుపులు, పెడబొబ్బలు పెరుగుతున్నాయి. నీటిమట్టం తగ్గడం లేదు. భారమంతా భగవంతునికొదిలేసి బిక్కుబిక్కుమంటున్నారు.

తెల్లవారుతోంది. బతుకుమీది ఆశల్లా వెలుగురేఖలు విస్తరిస్తున్నాయి. బయట వర్షం తుంపరగా మారింది. తెల్లవారింది. వెలుగులో ఇల్లంతా నీరే కనబడుతోంది. కానీ వస్తువులేవీ కనబడడం లేదు. అంటే .... అన్నీ కొట్టుకుపోయినట్టే... రాత్రికి విడిచిన డ్రెస్సు జాడలేదు. పాంటుజేబులో మూడువేల రూపాయలు నగదు... ఎటు కొట్టుకుపోయిందో! ఒంటి మీదున్న లుంగీ బనీను పూర్తిగా తడిసిపోయినై.

'మన పెళ్ళిరోజు నాడే మనకు చావు రాసి పెట్టినట్టుంది రజనీ!' ఎగదన్నుకొస్తున్న బాధనంతా గొంతులో అదిమిపెట్టి తలపట్టుకున్నాడు శేఖరం.

'ఛా... అలా ఎందుకనుకోవాలి?' రజని ధైర్యం.

'పదండి బయటకు వెళ్దాం... కనీసం ప్రాణాలన్నా కాపాడుకుందాం... బతికుంటే బలుసాకు తిని బతకొచ్చు...'

మంచం దిగింది. ఇద్దరూ కలిసి బయటకొచ్చారు. ప్రాణాలరచేతుల్లోకి వచ్చినై. ఒకరికొకరు ఆసరాగా మూడంతస్తుల బంగళా ముందుకెళ్ళారు. ప్రవాహంలో కుక్కపిల్ల శవం కొట్టుకుపోతూ రాజశేఖరం ఒంటికి ఒరుసుకుంది. అడుగులు జాగ్రత్తగా పడకపోతే మనుషులు కూడా కొట్టుకుపోతారు.

బంగళా అంతస్తుల మీద ఇసుక వేస్తే రాలనంత జనం ఉన్నారు. అసలది ఎక్కుదామన్నా కుదరలేదు. బంగళాపైన తొక్కిసలాట మొదలయింది. ఎక్కడ చూసినా ఏడ్పులు. పెడబొబ్బలే. ఇళ్ళ పైకప్పులన్నీ జనాలతో నిండి వున్నాయి.

శేఖరం, రజని మొండి ధైర్యంగా వెనుదిరిగారు. ఒకరినొకరు గట్టిగా పట్టుకున్నారు. గుండె దిటవు చేసుకుని గంటసేపు ప్రవాహంలో నడిచి బయటపడ్డారు. రోడ్డు మీద, ప్రవాహమంతా అల్లకల్లోలంగా ఉంది. బాధితులు, బంధువులు గొల్లుగొల్లుమంటున్నారు. గుండెలు బాదుకుంటున్నారు.

'ఇప్పుడు మనకు దిక్కెవరండీ...?' రజని బావురుమంది. 'ఈ హైదరాబాదు నగరంలో మనకు బంధువులెవ్వరూ లేరు గదా!' శేఖరం నరాలు బాధాస్వరాలు పలుకుతున్నాయి. మధ్యాహ్నం కావస్తోంది. ప్రభుత్వాధికారులు ఒక్కొక్కరే వస్తున్నారు. చిలకపలుకుల్లా బాధితుల ముందు సానుభూతి వాక్యాలు వల్లిస్తున్నారు. ఎలక్ట్రానిక్ మీడియా వాళ్ళు దృశ్యాలు చిత్రీకరిస్తున్నారు.

'చేతిలో చిల్లిగవ్వ లేదు. ఆకలేస్తోంది. ఈ సిటీలో మననాదుకునే దేవుడే లేడా?' ఏడ్చి ఏడ్చి రజని గొంతు బొంగురు పోయింది. రాత్రంతా అరుపులు, అంగలార్పుల ఫలితమది.

'ఏం సార్! మీరిక్కడున్నారా?' వెనకనుండి శేఖరం భుజమ్మీదో చెయ్యి పడింది. తిరిగి చూశాడు. రామరాజు...ఆఫీస్ అటెండర్ అప్పుల రామరాజు... నాలా ప్రవాహంలా ఆవేదన పొంగుకొచ్చింది.

'అవును రామరాజు! మా ఇల్లును నాలా నీళ్ళు ముంచేసినై. కట్టుబట్టలతో బతికి బయటపడ్డం..' చలికి వణుకుతూ వెక్కి వెక్కి ఏడుస్తూ అంతా చెప్పేశాడు. రజనికి రామరాజు పరిచయమే.

'ఈ సిటీలో మావారెవ్వరూ లేరు' నెత్తికొట్టుకుంది. రామరాజు అప్పివ్వలేదని భర్త చెప్పాడు కాబట్టి ఆమె దృష్టిలో అతడో పిసినారి పాపాత్ముడు.

'అట్లెందుకంటరమ్మా! నేను లేనా? పదండి ... మా ఇంటికెళ్దాం...'

భార్యాభర్తలు విస్మయంగా మొహాలు చూసుకున్నారు. నమ్మశక్యం కాలేదు.

'నిజంగానా రామరాజూ!' శేఖరం ఆశ్చర్యం ... 'వడ్డీ వ్యాపారంలో ఆరితేరిన నువ్వు.. నువ్వేనా ఆ మాటన్నది...?'

'నేనే సార్! అప్పులిచ్చే వాళ్ళంతా పాపాత్ములు కారు. ఇవ్వాళ్ళ ఆఫీసుకెళ్ళాను. మన స్టాఫ్ మీ గురించి మాట్లాడుకుంటున్నారు. మీరు ఆపదలో ఉన్నారని అర్థమైంది. వెంటనే ఇటు పరుగెత్తుకొచ్చి మీ కోసం వెతుకుతున్నాను. నేను డబ్బులు వడ్డీలకు తిప్పుతున్నది ఆపదలో ఉన్న వాళ్ళనాదుకునేందుకే గాని జల్సాలకు అప్పులిచ్చి జబర్దస్తీగా వసూలు చేసేందుకు కాద్సార్!' అంటూ అమాంతం గుండెలకు హత్తుకున్నాడు.

'మీ ఆపద నా ఆపదే సార్...!'

ఆటో పిలిచి ఎక్కమన్నాడు. వజవజ వణుకుతూ మరోసారి మొహాలు చూసుకున్నారు. రామరాజు రజని చెయ్యందుకొని కళ్ళకద్దుకున్నాడు.

అనుమానం వద్దు చెల్లెమ్మా! మీకిష్టమున్నన్ని రోజులు మా ఇంట్లో వుండండి... నా భార్యకు ఫోన్ చేసి మీరొస్తున్నారని చెప్పాను'.

కంటిధారల్లోంచి రామరాజు అస్పష్టంగా కన్పించాడు. చేతిగుడ్డతో ఇద్దరి కళ్ళు అద్దాడు రామరాజు.

'మనం వెళ్ళేసరికి భోజనం రెడీగా వుంటుంది. మీ పెళ్ళి రోజు సింపుల్‌గా జరుపుకుందాం. మీకు కొత్త బట్టలు పెడతాను. పెళ్ళిరోజు బహుమతి అనుకోండి. ..ఇదంతా అప్పుగా కాదు. నా ఆత్మతృప్తి ... అంతేనమ్మా!' ప్రాధేయపడ్డాడు.

'పద రజనీ! కలియుగములో గూడా ధర్మాత్ములున్నారు.' రజని చెయ్యిబట్టి ఆటో ఎక్కించి తానూ కూచున్నాడు శేఖరం. అతని పక్కన రామరాజు కూచోగానే ఆటో బయలుదేరింది.

నల్లని రామరాజు మనసు తెల్లదనానికి మనసులోనే నమోవాకా లర్పిస్తోంది శేఖరం జంట!

(ముంబైవన్- 1 -15 జనవరి 2011)